ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జూలై 2024

# పరి'శ్రమ' వరించేనా?

- పరిశ్రమలకు అనువైన గడ్డ కడప
- జిల్లాలో విస్తారంగా వనరులు
- కడప నుంచి చెన్నై, హైదరాబాదు, బెంగళూరులకు దగ్గరే
- విమానాశ్రయం, జాతీయ రహదారులు
- దగ్గరలోనే కృష్ణపట్నం పోర్టు

**అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా జిల్లాలో అరుదైన ఖనిజ సంపద ఉన్నా ఆ దిశగా పరిశ్రమల స్థాపనకు సరైన అడుగులు పడలేదు. ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై జిల్లావాసులు యువత ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కడప జిల్లాలో చంద్రబాబు హయాంలో స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. 2019లో జగన్ కొలువుదీరడంతో అది ఆగిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో స్టీలు ఫ్యాక్టరీపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ డిక్లరేషన్‌ను కడపలో ప్రకటించారు. సీమ జిల్లాలను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏ విధంగా అభివృద్ధి చేస్తారో క్షుణ్ణంగా వివరించారు. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉంది. కడప పార్లమెంటు పరిధిలోనే ఐదుగురు కూటమి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. దీంతో ఇప్పుడు జిల్లా వాసుల ఆశలన్నీ ఎమ్మెల్యేలపైనే ఉన్నాయి. వీరు ఏమేరకు పైస్థాయిలో వత్తిడి తెచ్చి పరిశ్రమలు తీసుకొచ్చి తమ మార్కు చూపించుకుంటారా అని చర్చ నడుస్తోంది.**

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా.. అన్ని సహజ వనరుల నిక్షేపాలు ఉన్న గడ్డ. ఈ మట్టిలోనే యురేనియం, ఐరన్‌వోర్, బైరైటీస్ నిక్షేపాలతో పాటు విద్యుత్ వాహనాల బ్యాటరీ తయారీలో వాడే నికెల్ నిక్షేపాలు ఉన్నట్లు జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇక్కడున్న వనరులను ఒడిసి పట్టుకుని పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్ది ఉపాధికి కడపను కేరాఫ్‌గా మార్చే సువర్ణ అవకాశం ఉన్నప్పటికీ ఇంత వరకు పూర్తి స్థాయిలో అడుగు పడలేదు. ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు, విభజిత రాష్ట్రానికి ఒకసారి సీఎంలను అందించిన ఘనత కడప జిల్లాకు ఉంది. అయినా ఇక్కడ పారిశ్రామికంగా చెప్పుకోదగిన అభివృద్ధి ఇప్పటి వరకూ జరగలేదు.

### పరిశ్రమలకు అనుకూలం

జిల్లాలో ఐరన్ వోర్, ఐటీ పరిశ్రమ, బస్సుల తయారీ, ఎలక్ట్రానిక్స్. ఇలా ఏ పరిశ్రమ అయినా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కడప శివారులో కొప్పర్తి పారిశ్రామిక వాడ ఉంది. ఇక్కడ ఆరువేల ఎకరాలకు పైగా భూములున్నాయి. చెన్నై-హైదరాబాదు జాతీయ కారిడార్‌లో




కడప భాగస్వామ్యంగా ఉంది. అన్నిటికంటే ముఖ్యం కడప నుంచి మెట్రోసిటీలైన బెంగళూరు, చెన్నైలు కూతవేటు దూరమే. హైదరాబాదు కాస్త దూరం. కడప నుంచి అటు హైదరాబాదు, ఇటు బెంగళూరు, చెన్నై, క్రిష్ణపట్నం పోర్టు.. ఎటు చూసినా అన్నీ జాతీయ రహదారులే ఉన్నాయి. ఇక జిల్లా నుంచి ముంబై, ఢిల్లీకి సైతం రైలు కనెక్టివిటీ ఉంది. కడప విమానాశ్రయంలో నైట్‌ల్యాండ్ సౌకర్యం ఉంది. మెట్రో సిటీస్‌కు ట్రైన్ కనెక్టివిటీ ఉంది. అయితే లేనిదంతా రాజకీయ నేతల్లో చిత్తశుద్ధి.

### జగన్ హయాంలో నామమాత్రమే

సొంతజిల్లా వాసి, పులివెందుల ఎమ్మెల్యే జగన్ ఐదేళ్లు సీఎంగా పనిచేశారు. ఆయన కాలంలో కడపజిల్లా పారిశ్రామికంగా ఎక్కడికో తీసుకెళ్తారనుకున్నారు. రెండుసార్లు స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసినా నిర్మాణం చేయని ఘనత ఆయనకే దక్కుతుంది. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కడప శివారులో రిమ్స్ వద్ద ఐటీ పరిశ్రమ కోసం దాదాపు 49 ఎకరాల స్థలం కేటాయించారు. అయితే దానిని అడ్డంగా తన వాళ్లకు జగన్ అప్పగించారు. ఇక గోపవరంలో సెంచరీ ప్లేవుడ్ ఫ్యాక్టరీ ఏర్పడింది. అది కొద్దిమందికి మాత్రమే ఉపాధి కల్పిస్తోంది. వైసీపీ నేతలు వారి అనుచరులకే అక్కడ ఉద్యోగాలు ఇచ్చారు. అందులోనూ కేవలం ఒక వర్గానికే ఇచ్చారనే చర్చ ఉంది. జిల్లాలో అన్ని వనరులు ఉన్నా ఐదేళ్ల జగన్ జమానాలో సెంచరీ ప్లేవుడ్, డిక్సన్ ద్వారా నామమాత్రంగా ఉపాధి కల్పించేసి చంకలు గుద్దుకున్నారు.

### కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో కూటమికి జనం జై కొట్టడాన్ని చూసి యావత్ ఆంధ్రనే ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇప్పుడు పరిశ్రమలు తెచ్చే బాధ్యత కూటమిపై ఉంది. జిల్లాలో ఐటీ, స్టీలు ఫ్యాక్టరీ, ఎలక్ట్రికల్ ఇలా ఏ పరిశ్రమ పెట్టినా అన్ని వనరులు ఉన్నాయి.

- కడప శివారులోనే కొప్పర్తి పారిశ్రామికవాడ ఉంది. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు అయితే కడప నగరం వైజాగ్‌ను మించిపోతుంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ఇటీవలే మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కడపలో కనీసం 15వేల ఉద్యోగాలు వచ్చే ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయాలని కోరారు. రిమ్స్ వద్ద ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇక్కడ సుమారు 49 ఎకరాలను అడ్డగోలుగా జగన్ అండ్ కో తన వర్గీయులకు కట్టబెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కడపలో ఇంజనీరింగ్ ఇతర కళాశాలలు పెద్దఎత్తున ఉన్నాయి. కడప పెద్ద గ్రోత్ సెంటరు. ఇది రాయలసీమకే అడ్డా. అయితే ఉపాధి కోసం పొరుగున ఉన్న చెన్నై, బెంగళూరు, హైదరాబాదు ఇతర ప్రాంతాలకు వెళతారు. కడపలో ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉద్యోగాలు వస్తాయి. దీంతో కడప సిటీ విస్తరిస్తుందని మాధవి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం.
- కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమల కోసం ఓ బ్లూప్రింట్ సిద్ధం చేశారని సమాచారం. ఇక్కడ 6వేల ఎకరాల భూములున్నాయని, కొప్పర్తిలో పరిశ్రమ పెడితే పరిస్థితే మారిపోతుందంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.
- జమ్మలమడుగు ప్రాంతంలోనే అటు టీడీపీ, ఇటు జగన్ హయాంలో స్టీలు ఫ్యాక్టరీకి టెంకాయలు కొట్టారు. ఇప్పుడు అక్కడ పరిశ్రమ ఏర్పాటు బాధ్యత బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఉంది. ఎందుకంటే కేంద్రంలో బీజేపీ ఉంది. నియోజకవర్గంలో మంచి ఖనిజ నిక్షేపాలున్నాయి. జమ్మలమడుగు నుంచి ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి ఉన్నారు. స్టీలు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించే బాధ్యత ఆయనపై ఉంది. ప్రొద్దుటూరు అంటే అదో సెకండ్ ముంబై. ఇక్కడ కూడా అన్ని పరిశ్రమలకు అనువైన వసతులు ఉన్నాయి. మైదుకూరులో కూడా రైతులకు అవసరమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇతర పరిశ్రమలు, సోలార్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది.
- ఇక పులివెందుల ఎమ్మెల్యే జగన్ తాను సీఎంగా పనిచేసినప్పుడు వేలకోట్లు ఇచ్చినట్లు పెద్దఎత్తున కటింగ్ ఇచ్చారు తప్ప ఆ స్థాయికి తగ్గట్లు అక్కడ అభివృద్ధి లేదు. కేవలం రింగురోడ్డు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారే కానీ.. పేదలకు నాలుగు వేళ్లు నోట్లో పోయే విధంగా శాశ్వత పరిష్కారం లేదు. గతానికి భిన్నంగా ఈ ఎన్నికల్లో అక్కడ జగన్ మెజారిటీ తగ్గింది. ఈ నేపథ్యంలో అక్కడ అపారంగా ఉన్న వనరులు ఉపయోగించుకుని పరిశ్రమలు తీసుకొచ్చి టీడీపీ బలం మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లా జనం గుండెల్లో శాశ్వతంగా ముద్ర వేసుకోవాలంటే వారికనుగుణంగా పరిశ్రమలు తేవాలి. ఎందుకంటే చంద్రబాబు సీఎం అయిన తరువాత వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. వాటిల్లో పెద్దపరిశ్రమ కడపకు వస్తే జిల్లా రూపురేఖలే మారుతాయి. ఇందుకోసం మన ఎమ్మెల్యేలు కృషి చేయాల్సి ఉంది.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్ నాయుడు



## నేడు ఎంపీ సీఎం రమేశ్ జిల్లాకు రాక

- కూటమి కార్యకర్తలు నాయకులతో విజయోత్సవ ర్యాలీ

ప్రొద్దుటూరు, జూలై 11: అనకాపల్లి బీజేపీ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన సీఎం రమేశ్ జిల్లాకు మొదటిసారిగా శుక్రవారం రానున్నారని ఆయన సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి నేరుగా దేవుని కడపకు చేరుకుని వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారన్నారు. అలాగే కడప పెద్ద దర్గాలో ఆశీస్సులు తీసుకుని రోడ్డు మార్గాన చెన్నూరు, ఖాజీపేట, మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటారన్నారు. ప్రొద్దుటూరు కొత్తపల్లి జంక్షన్ వద్ద ఎంపీ రమేశ్‌కు టీడీపీ బీజేపీ జనసేన కూటమి నాయకులు కార్యకర్తలు భారీగా ఆహ్వానం పలకనున్నారని తెలిపారు. అక్కడి నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మైదుకూరు రోడ్డు, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్, గాంధీరోడ్డు, ఒన్‌టౌన్ సర్కిల్ గుండా ఎర్రగుంట్ల రోడ్డు వాసవి సర్కిల్ నుంచి స్వంత గ్రామమైన పోట్లదుర్తికి వెళతారన్నారు. అక్కడ ఎంపీ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడతారన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీని కూటమి నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, ఖలీల్ జనసేన ప్రతినిధి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠభరితంగా హాకీ పోటీలు



సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్‌లో తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్లు

పులివెందుల రూరల్, జూలై 11: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతున్న సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. గురువారం జరిగిన జూనియర్ ఉమెన్ విభాగంలో కేరళ-పాండిచ్చేరిల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 తేడాతో కేరళ జట్టు విజయం సాధించింది. అలాగే తమిళనాడు-కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-3 తేడాతో కర్ణాటక, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 0-11తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించాయి. జూనియర్ మెన్ విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి మధ్య మ్యాచ్ జరగ్గా 7-0తేడాతో తమిళనాడు, తెలంగాణ-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-0 తేడాతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 0-4 తేడాతో కర్ణాటక జట్లు విజయం సాధించాయి.

# విజృంభిస్తున్న విషజ్వరాలు

- మిడుతూరులో డయేరియాతో ఒకరి మృతి
- గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నం



మృతి చెందిన సునీల్ (ఫైల్ ఫొటో)



బావిలోకి కలుషిత నీరు పోతున్న దృశ్యం

ఖాజీపేట, జూలై 11: మండల పరిధిలో రోజూ ఏదో ఒక చోట జ్వరాలు, విరేచనాలు, వాంతులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసి కొత్తనీరు వచ్చి చేరడంతో నీరు కలుషితం అవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వైద్యాధికారులు హడావుడి చేయడం తప్ప నిర్దిష్ట చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఖాజీపేట మండల పరిధిలోని మిడతూరులో బయనపల్లె సునీల్ (19) అనే యువకుడు బుధవారం రాత్రి విరేచనాలతో ప్రొద్దుటూరు ఆస్పత్రికి వెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. గ్రామంలో దాదాపు 30 మందికి పైగా వాంతులు, విరేచనాలతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

### నీరు కలుషితం అంటున్న గ్రామస్తులు..

మిడుతూరులో ఊరికి దగ్గరలో పాడుబడ్డ బావి ఉందని, అందులోకి కలుషిత నీరు పోతోందని ఆ నీరే బోరు ద్వారా వస్తుందని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని మండల పరిధిలో వ్యాపిస్తున్న డయేరియాను నివారించాలని కోరుతున్నారు. కాగా మిడుతూరులో డయేరియా బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్‌వో నాగరాజు పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, వైద్యాధికారి సుమన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఐ రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్యం అధ్వాన్నం..

మిడుతూరులో నీరు కలుషితం కావడం వలనే పలువురు జ్వరాలు, విరేచనాల బారిన పడ్డారని గ్రామస్తులు అంటున్నారు. మండల పరిధిలో ఏ గ్రామానికి వెళ్లినా పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల నిధులు పక్కదారి పట్టడంతో ఈ దుస్థితి తలెత్తిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్యంతో పాటు శుద్ధి చేసిన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 11: సీజనల్ వ్యాధులపై, డయేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ లోతేటి శివశంకర్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో కలసి డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య భద్రతపై కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా రహిత, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. ఖాజీపేట మండలం మిడుతూరులో 19 ఏళ్ల యువకుడు అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన దిగ్ర్భాంతికి గురిచేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా వైద్యాధికారులు, పబ్లిక్ హెల్త్, పంచాయతీ, మున్సిపల్ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఎన్ఎం, ఆశ సిబ్బందితో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేడి నీటిని తాగడం, స్వీయ పరిశుభ్రతను పాటించడంపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. సంక్షేమ అధికారులు సంబంధిత హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మంచినీటి సదుపాయాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజనం శుచిగా, శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో వెంకటపతి, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.





# ఆగని వైసీపీ నేతల గ్రావెల్ దందా

- ప్రభుత్వం మారినా సరే యథేచ్ఛగా రవాణా
- వేంపల్లె, సీకేదిన్నె, పులివెందులలో కొల్లగొడుతున్న వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ పాలన జనానికి ఆదో పీడకల. బటన్ నొక్కుతున్నాను అని ఫోజు కొట్టడం తప్ప ఆయన హయాంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. కళ్ల ముందు నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలు జరుగుతున్నా కూడా సోషల్ మీడియాలో వైసీపీ పేటీయం బ్యాచ్ నోరెత్తేది కాదు. ముఖ్యంగా వేంపల్లె, పులివెందుల, బద్వేలుకు చెందిన కొన్ని పేటీయం బ్యాచ్‌లు ప్రభుత్వ సొమ్మును జీతాలుగా తీసుకుంటూ మేధావులుగా ఎలివేషన్ ఇచ్చుకుంటూ.. ఎల్లో మీడియా అంటూ కొన్ని సామాజిక వర్గాలపై విషం చిమ్మేవి. వైసీపీ ప్రభుత్వంలో సహజ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టినా పట్టించుకునేవి కావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కూడా అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతుండడం అందులోనూ కొందరు వైసీపీ నేతలు తగ్గేదే లేదంటూ ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండడం చూసి ఔరా.. ఇది కూటమి గవర్నమెంటా, లేక వైసీపీ గవర్నమెంటా అంటూ జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పులివెందుల పరిధిలో ఇష్టారాజ్యంగా కొండలు కొల్లగొట్టి గ్రావెల్ తరలిస్తున్నారు. పెండ్లిమర్రికి చెందిన ఓ వైసీపీ నేత వేంపల్లె నుంచి గ్రావెల్ దందా కొనసాగిస్తున్నారంటారు. వేంపల్లె నుంచి తెచ్చే గ్రావెల్‌ను ఇటు కడప కొప్పర్తి, అటు వేంపల్లెలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనుమతులు లేని గ్రావెల్ తవ్వకాల పై తీవ్ర దుమారం రేగింది. రాయల్టీ కట్టకుండా మైదుకూరు నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తవ్వేసి ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారంటూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు లేకున్నా కొండను తవ్వి గుల్ల చేశారంటూ ఆ ఫొటోలను కూడా సమావేశం ముందుకు తీసుకువచ్చారు. ఇలా అడ్డగోలు తవ్వకాల వల్ల పర్యావరణానికి హానితో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక పులివెందులలో కొండలు, గుట్టలు గుల్లచేసి ఇష్టారాజ్యంగా మట్టిని లూటీ చేశారు. సీకేదిన్నె పరిధిలోని జమాల్‌పల్లె వద్ద వైసీపీ నేతలు గుట్టను తవ్వేసి కడపలో వెంచర్లకు అమ్మేస్తున్నారు. ఒక్కో టిప్పరును రూ.4వేల నుంచి 5వేల మధ్య అమ్ముకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా అధికారుల్లో ఇంకా మార్పు రాలేదు. ఎందుకంటే జిల్లాలో ఇప్పటికీ వైసీపీ హయాంలో నియమితమైన అధికారులే ఉండడంతో వైసీపీ నేతలకు జీహుజూర్ అంటున్నారు.

వేంపల్లె సమీపంలో గ్రావెల్ కోసం కొండను తొలిచిన దృశ్యం





# ‘సంపద’ కేంద్రాలు నిర్వీర్యం

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. నీరుగారిన లక్ష్యం
- మరుగున పడిన చెత్త సంపద తయారీ కేంద్రాలు
- జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్స్ ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వంలో... మనుగడ సాగించేనా

సంబేపల్లె, జూలై 11: గ్రామీణ ప్రాంతాలే దేశ ప్రగతికి మూల స్తంభాలు. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఒక్కో కేంద్రానికి రూ.8 నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించారు. ఒక్కో మండలంలో సరాసరి 15 నుంచి 20 కేంద్రాలు నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు.

### నీరు గారిన పథకం లక్ష్యం


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

చెత్త నుంచి నాడప్ కంపోస్టుల ద్వారా ఎరువులను తయారు చేసి.. రైతులు పంట సాగులో రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడుకునే విధంగా గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచాలనుకున్నారు. తడి, పొడి చెత్తసేకరణ చేపట్టి తద్వారా సంపదను సృష్టించవచ్చునని భావించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం మారడంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యం అయిపోయాయి. ఈ పథకం లక్ష్యం నీరుగారిందనే చెప్పవచ్చు.

### సక్రమంగా సాగని చెత్తసేకరణ



సంబేపల్లె మండలంలో 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కలవు. 34 మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు అందించా లి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలించాలి. అక్కడ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప వస్తువులు వేర్వేరుగా చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండల వ్యాప్తంగా చెత్తసేకరణ చాలా గ్రామాల్లో జరగలేదు. అధికారులు మాత్రం చెత్త నుంచి వేరు చేసిన ప్లాస్టిక్ గాజు సీసాలు, ప్లాస్టిక్ ద్వారా నెలకు కొన్ని కేంద్రంలో 200 మరికొన్ని కేంద్రాల్లో 500, మరికొన్ని కేంద్రాల్లో 1000 నుంచి 1500 వస్తున్నట్లు చెబుతున్నారు. సంబేపల్లె మండలంలో 34 మంది గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రెండు లక్షల రూపాయలు జీతాల ద్వారా చెల్లించాలి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయం వేలల్లో ఉంటే జీతాలు మాత్రం లక్షల్లో ఉన్నాయి. దీంతో రాబడి తక్కువ, ఖర్చులు ఎక్కువ అని చెప్పవచ్చు.

### నాడాఫ్ కంపోస్ట్ పిట్స్‌లో పిచ్చిమొక్కలు



ఒక్కో పంచాయతీలోని హ్యాబిటేషన్‌లో ఒక రైతుకు నాడాఫ్ కంపోస్టు బిట్స్ కోసం ఉపాధి హామీ పథకంలో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా వీటిని సుమారు రూ.12 వేల అంచనాతో నిర్మించారు. ఇప్పటి వరకు చెత్త నుంచి సంపద కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఎక్కడా కంపోస్ట్ ఎరువులు మాత్రం తయారు కాలేదు. పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా వదిలేశారు.

### అసంపూర్తిగా సంపద తయారీ కేంద్రాలు


గాండ్లపల్లి వద్ద ఫిల్లర్ల దశలో ఆగిన సంపద తయారీ కేంద్రం

మండల వ్యాప్తంగా ఉన్న 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో కొన్ని చోట్ల కొన్ని పనులు అసంపూర్తిగా వదిలేశారు. శెట్టిపల్లె గ్రామంలో గాండ్లపల్లి వద్ద ఇప్పటికీ ఫిల్లర్ల దశలో నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల గదులు నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్స్ ఎదురుచూపు



మండలంలో ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్స్ చెత్త సేకరణ సిబ్బందికి వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా జీతాలు అందలేదు. జీతం కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడా అప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో దుర్భర స్థితిలో పంచాయతీ మనుగడ సాగింది. ఇప్పటికైనా పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని కోరారు.

### కూటమి ప్రభుత్వంలో మనుగడ సాగించేనా...

2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అసంపూర్తిగా ఉన్న సంపద సృష్టి కేంద్రాల పరిస్థితిపై దృష్టి సాధించాలి. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన సంపద సృష్టి కేంద్రాలను మనుగడ సాగించేలా చర్యలు చేపట్టి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## హుండీల లెక్కింపు... రూ.23.87లక్షల ఆదాయం



చక్రాయపేట, జూలై 11: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపు ద్వారా రూ.23,87,865 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో 105 రోజులకు సంబంధించి హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ ఏఎస్ఐ రామకృష్ణ, ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ బబానుచందర్, క్యాషియర్ అన్వేష్, ఉప ప్రధాన అర్చకులురాజారమేష్, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలి : డీఈఓ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలని జిల్లావిద్యాశాఖాధికారి అనురాధ సూచించారు. గురువారం కడప నగరం అలంఖాన్‌పల్లె మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం మెరుగుపరచాలన్నారు. ప్రతి విద్యార్థిపై కేర్ తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రాయడం, చదవడం నేర్పించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్నభోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## బొప్పాయి తోటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొండాపురం, జూలై 11: మండలంలోని గండ్లూరు పొలంలో ఉన్న బొప్పాయితోటను డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ సుశీల, డాక్టర్ సునీల్ కుమార్‌లు పరిశీలించారు. వీవీ నరసింహారెడ్డి అనే రైతు తన ఏడు ఎకరాల పొలంలో 3500 బొప్పాయి మొక్కలను నాటాడు. ఏడు నెలలైనా మొక్కలు పెరి గినప్పటికీ దిగుబడి రావపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శాస్త్రవేత్తలు బొప్పాయితోట మట్టి నమూనలతో పాటు, వేర్లు తదితర వాటిని శాంపిల్స్ తీసుకున్నారు. అధికారుల సూచన మేరకు సరైన సమయంలో సరైన మందులు, ఎరువులు వాడినా దిగుబడి రాలేదని రైతు శాస్త్రవేత్తలకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మధుమల్లేశ్వర రెడ్డి, ఏవో రామాంజలరెడ్డి, జైన్ డ్రిప్ ప్రతినిధి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా డాక్టర్ సానె శేఖర్


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సానె శేఖర్

పుల్లంపేట, జూలై 11: పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ సానె శేఖర్ అన్నమయ్య జిల్లా ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా గురువారం రాయచోటిలో ప్రశంసాపత్రాన్ని, క్యాష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పుల్లంపేట ప్రభుత్వ వైద్యు లు మనోజ్‌చంద్ర, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## కలెక్టరు చొరవతో తాళాలు తొలగింపు


ఫర్నీచర్, కంప్యూటర్లను తరలిస్తున్న దృశ్యం

బి.కోడూరు, జూలై 11: కలెక్టర్ చొరవతో మున్నెల్లి సచివాలయం తాళాలు తెరిపించి ఫర్నీచర్‌ను కొత్త సచివాలయానికి తరలించారు. గతంలో మున్నెల్లి సచివాలయం అద్దె భవనంలో ఉండేది. ప్రస్తుతం కొత్త సచివాలయం పూర్తయినందున కంప్యూటర్లు, రికార్డులు, ఫర్నీచర్ అద్దె భవనం నుంచి తీసుకెళ్లేందుకు రాగా సచివాలయ అద్దె భవనయజమాని, ఎంపీటీసీ మాధవరెడ్డి తనకు పూర్తిగా అద్దె చెల్లించి తీసుకెళ్లాలని ఖరాఖండిగా తెలిపారు. దీంతో సర్పంచ్ కలెక్టరుకు ఫిర్యాదు చేయగా ఈ రోజు సాయంత్రానికల్లా ఫర్నీచరు, కంప్యూటరు రికార్డులను కొత్త సచివాలయానికి తరలించాలని కలెక్టరు ఎంపీడీఓ భాస్కర్‌రావును ఫోను ద్వారా ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ పోలీసుల సాయంతో తాళాన్ని తొలగించి అక్కడున్న ఫర్నీచర్ తదితర సామగ్రిని కొత్త సచివాలయానికి తరలించారు. అద్దె భవన యజమానికి మీ బాడుగ పూర్తిగా చెల్లించేందుకు బిల్లు పెట్టామని అది వచ్చిన వెంటనే మీ డబ్బు మొత్తం చెల్లిస్తామని తెలిపారు.

## అధార్ మార్ఫింగ్ చేసి అక్రమ రిజిస్ట్రేషన్ నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ముద్దనూరు జూలై 11: ఆధార్ కార్డు మార్ఫింగ్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ భూ రిజిస్టర్ చేసుకున్న చిన్న దుద్యాల గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకట మదన్‌మోహన్ రెడ్డిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. బోరెడ్డి వెంకట మదన్‌మోహన్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన బోరెడ్డి ప్రభావతమ్మకు చెందిన భూమి సర్వే నెంబరు 25లోని 4.45 ఎకరాల భూమిని అతని మేనత్త సానం సావిత్రమ్మ ఆధార్‌కార్డుతో మార్ఫింగ్ చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం బోరెడ్డి ప్రభావతమ్మ వేరే గ్రామంలో నివాసం ఉంది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం బోరెడ్డి వెంకట మదన్‌మోహన్‌రెడ్డి, ఆధార్ మార్ఫింగ్ చేసిన కడప సిటీలోని ఓ నెట్ సెంటర్ యజమాని బండినాగిరెడ్డి మరి కొందరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

## 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడ్డ దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ అటవీశాఖ సిబ్బంది

రాజంపేట/సుండుపల్లె, జూలై 11: రాజంపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు మెరుపుదాడులు చేసి 8 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి.. 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సానిపాయ రేంజ్‌లో తనిఖీ చేస్తుండగా రాయవరం సెక్షన్ పరిధిలో ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బ ందిని చూసి స్మగ్లర్లు దుంగలను అక్కడే పడేసి పారిపోతుండగా వారిని వెంబడించి 8 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలూకాకు చెందిన గోవిందన్, శ్రీనివాసన్, మురగన్, శక్తివేల్, తిరుపతి సెల్వం, సెల్వం చిన్నా, సురేష్‌లతో పాటు అనంతపురం జిల్లా కన్నపల్లెకు చెందిన వడ్డే సుబ్రమణ్యంలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది కె.సురేష్‌రాజు, వినోద్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## లింగారెడ్డిపల్లెలో చోరీ

కలసపాడు, జూలై 11: మండలంలోని లింగారెడ్డిపల్లెలో గురువా రం చోరీ జరిగింది. ఎస్ఐ నాగమురళీ తెలిపిన వివరాల మేరకు.. లింగారెడ్డిపల్లెకు చెందిన పాలకొలను రామసుబ్బారెడ్డి ఇంటి ఆరుబయట నిద్రిస్తుండగా ఇంటి వెనుక తలుపులు బద్దలు కొట్టి బీరువా, అల్మారాను తెరిచి చోరీ చేశారు. 8 తులాల బంగారు, రూ.70వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

- జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

రాయచోటిటౌన్, జూలై 11: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్య నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలనువినియోగంలోకి తీసుకువచ్చి సందపను సృష్టించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆమె రాయచోటి మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకు రావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాయచోటి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ అంవాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్యం, తాగునీటి సరఫరా, సీఆర్ఎస్ కాప్, చెత్త సందప తయారీ కేంద్రాల నిర్వహణ, పన్నుల రాబడి తదితర అంశాలపై సమీక్షించి పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేంద్రబాబు, ఈవోపీఆర్డీ సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణపై అవగాహన అవసరం

- పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకం
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి


జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

రాయచోటిటౌన్, జూలై 11: జనాభా నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం రాయచోటి ప్రాంతీయ వైద్యశాలలో, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు రేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక జనాభా వల్ల వచ్చే సమస్యలు, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ జనాభా దాదాపు 800 కోట్లు, భారతదేశ జనాభా దాదాపు 144 కోట్లు, ఆంధరప్రదేశ్ జనాభా 5 కోట్లకుపైగా ఉందని, ఈ సందర్భంగా తెలిపారు. జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగి పేదిరికం ఏర్పడే అవకాశం ఉందన్నారు. జనాభా పెరుగుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆడపిల్లల వివాహానికి కనీస వయస్సు 21 సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జనాభా నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ మంచి పురోగతి సాధించిందని, సంతాన ఉత్పత్తి రేటును 1.6కు తగ్గించగలిగిందన్నారు. దీన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాక్షించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, డీసీహెచ్‌వో డేవిడ్ సుకుమార్, రాయచోటి ప్రాంతీయ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పులివెందుల టౌన్, జూలై 11: పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాల య్యాయి. పోలీసుల వివరాల మేరకు... నగరిగుట్ట సమీపంలో అబ్దుల్, అతని మామ కుళాయప్పపై శ్రీను, సంజీవ్, ఫయాజ్, సంపత్‌లు దాడి చేశారన్నారు. రాజేష్ అనే వ్యక్తి వెంట అబ్దుల్ తిరుగుతున్నాడనే ఉద్దేశ్యంతో ఈ దాడి జరిగిందన్నారు. ఈ దాడి లో అబ్దుల్, కుళాయప్పలు గాయపడగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 450 చౌక బియ్యం బస్తాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చౌక బియ్యం బస్తాలతో పోలీసులు

చెన్నూరు, జూలై 11: మండలంలోని శివాలపల్లె, చెన్నూరులో బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్లపై సీఐ నారాయణయాదవ్ తన సిబ్బందితో గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో శివాలపల్లె పంచాయతీ పరిధిలోని బ్రహ్మయ్య గోడౌన్‌లో 250 బస్తాలు, చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలో నాగిరెడ్డి గోడౌన్‌లో 150 బస్తాల చౌక బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు చౌకబియ్యం అక్రమ నిల్వల గోడౌన్లపై దాడులు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల చాలా వరకు అక్రమంగా నిల్వ ఉంచిన చౌక బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పట్టడంతో ఈ చౌకబియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి.. నిరంతరం దాడులు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐలు ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాల్వలో పసికందు శవం

ప్రొద్దుటూరు క్రైం, జూలై 11: పట్టణంలోని మదూరు కాల్వలో అప్పుడే పుట్టిన పసికందు శవం బయటపడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులు సిబ్బందితో అక్కడికి చేరుకుని శిశువు మృతదేహాన్ని బయటికి తీశారు. గుర్తు తెలియని వ్యక్తులు శిశువు మృతదేహాన్ని మూడు రోజుల క్రితం కాల్వలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


# పోట్లదుర్తిలో భారీ ఏర్పాట్లు

- అనకాపల్లి ఎంపీగా అఖండ విజయం
- మొదటిసారిగా సీఎం రమేష్ పోట్లదుర్తికి
- ఏడువేల మందికి భోజనాలు
- వేయి వాహనాలతో భారీ ర్యాలీ

ఎర్రగుంట్ల, జూలై 11: పోట్లదుర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సీఎం రమేష్ అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా భారీ మెజార్టీతో గెలుపొంది స్వగ్రామం పోట్లదుర్తికి మొదటిసారిగాతి శుక్రవారం వస్తుండడంతో ఆయనకు స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దగ్గరుండి అన్ని పనులు చక్కబెడుతున్నారు. ర్యాలీ విజయవంతం చేసేందుకు జిల్లా నలమూలల నుంచి ప్రజాప్రతి నిధులు, ఎన్డీయే కూటమి నేతలకు ఆహ్వానం పంపుతున్నారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి పోట్లదుర్తి వరకు భారీగా సాగే ఈ ర్యాలీలో సుమారు వెయ్యి వాహనాలు పాల్గొంటున్నట్లు సీఎం సురేష్‌నాయుడు ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం పోట్లదుర్తిలోని వేర్‌హౌస్ వద్ద సుమారు 7వేల మందికి భోజనాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈపనులను సీఎం.సురేష్ నాయుడు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పోట్లదుర్తిలో సీఎం రమేష్‌కు స్వాగతం పలికేందుకు భారీగా ఫ్లెక్సీలను దారిపొడవునా ఏర్పాటు చేశారు. కాన్వాయ్‌లో పాల్గొనే వీఐపీలు, రాష్ట్ర, జాతీయ నేతలకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడు జిల్లాలు దాటి ఉత్తరాంధ్రలో భారీమెజార్టీతో గెలుపొందడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి జెండాలు రెపరెపలాడుతున్నాయి. మొదటిసారిగా ఆయన తన స్వగ్రామానికి వస్తుండడంతో భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు.


భారీగా ఏర్పాటు చేసిన పందిళ్లు... భోజనాలకు సిద్ధం చేస్తున్న దృశ్యం


పోట్లదుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు




**CHANGE OF NAME**
I, SHAIK KHADER BASHA (OLD NAME) S/o. SHAIK ISMAIL, Residing at Door No. 10/1030, Trank Road, Kadapa, YSR Dist, Andhra Pradesh 516001, India, do hereby Change My Name to SHAIK KHADAR BASHA (NEW NAME). Hence forth then now I may be called as SHAIK KHADAR BASHA (NEW NAME).
AJC-196027

**అర్జంటుగా కావలెను**
కడపలో ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు వార్డెన్, స్వీపర్, వంట మనిషి (కుక్) కావలెను. రూము+భోజనం కలదు, ఆకర్షణీయమైన జీతం, సెల్ : 9133117715
Ajc-188776

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 189278

**గాయత్రి జ్యోతిష్యం**
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.
AJA-189185

**CHANGE OF NAME**
I, Yerragudi Rama Mohan Reddy, S/o. Yerragudi Bayya Reddy, D.No:4-39, Yerragudivaripalli Village, Nadimikandriga Post, Guramkonda Mandal, Annamayya Dt., A.P., India, Here by declare that my name was changed as YERRAGUDI RAM MOHAN REDDY
AJT - 4117

**యూనిట్ కార్యాలయం**
9985411183
9985411189

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి




# దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

● ఆర్టీసీ ఆర్ఎంకు నేషనల్ మజ్దూర్ యూనియన్ వినతి

కడప (మారుతీనగర్), జూలై 11 : ఆర్టీసీ కడప రీజియన్‌లో గత ఐదు సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎస్.నాగముని, కార్యదర్శి సుధాకర్‌లు కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు (ఆర్ఎం) పి.గోపాల్‌రెడ్డిని ఆయన చాంబరులో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. గత ఐదు నెలలుగా కడప డిపోలో సంబంధిత డిపో ఉద్యోగులకు అలవెన్స్‌లు కలపకుండా జాప్యం చేయడం సరైంది కాదన్నారు. రీజియన్‌లో నిమిగతా అన్ని డిపోల్లో (మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు) కలుపుతున్నా ఒక్క కడప డిపోలోనే అలవెన్స్‌లు కలపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా చలనం లేక పోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క కడప డిపోలోనే కండక్టరు చార్టులు అమలు చేసి డ్రైవర్ల చార్ట్‌లకు మంగళం పలకడం సరికాదన్నారు. ఇప్పటికైనా కండక్టర్ల చార్టుతో పాటు డ్రైవర్ల చార్టు కూడా ఒకేమారు వేసేలా చూడాలన్నారు. ఆర్టీసీ ఈడీ ఆదేశాల మేరకు 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలన్నారు. రీజియన్ వ్యాప్తంగా డ్రైవర్లకు చదువు లేదనే కారణంతో 12, 18, 24, 30 సంవత్సరాల ఇంక్రిమెంట్లు కలపలేదని, సర్క్యులర్ నిబంధనల ప్రకారం లిటరసీ టెస్టు పెట్టి వారికి ఏఎస్ ఇంక్రిమెంట్లు కలిసేలా చూడాలని కోరారు. అలాగే చదువు లేని గ్యారేజీ సిబ్బందికి కూడా అదే తరహాలో ఇంక్రిమెంట్లు కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూ నేతలు

## బోగస్ అడ్మిషన్లు చేస్తున్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

● వైవీయూ రిజిస్ట్రార్‌కు పీడీఎస్‌యూ వినతి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11 : వైవీయూ పరిధిలో బోగస్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల బోగస్ అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థులకు చదువు చెప్పకుండా మోసం చేస్తున్నారన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, మాజీ ముఖ్యమంత్రి జగన్ బామ్మర్ది వీసీ సురేంద్రనాథరెడ్డి అండతో ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా, రోస్టరు పద్ధతి పాటించకుండా లక్షలాది రూపాయలు డబ్బు తీసుకుని పోస్టులను భర్తీ చేశారన్నారు. వీటి పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ముబారక్ బాషా, వెంకటేశ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## కోలాట బృందానికి కలెక్టర్ అభినందనలు


కలెక్టర్‌ను కలసిన మహిళా మండలి

కడప(కలెక్టరేట్), జూలై 11: భారతీయ సంసత్కృతిలో జానపదాలు, కోలాటాలకు ఓ ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ లోతేట శివశంకర్ పేర్కొన్నారు. గురవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబరులో అంతర్జాతీయ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కిన ప్రొద్దుటూరు సావిత్రి బాయి పూలే అభ్యదయ కోలాట బృందం కలెక్టర్‌ను కలిశారు. వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాధించడం,జిల్లాకు గర్వకారణమన్నారు. మన సంసృతిలో భాగమైన జానపదాలు కోలాటాలు కనుమరుగు అవుతున్న సమయంలో మన జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించిపెట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. గత నెల 29న ప్రొద్దుటూరుకు చెందిన బండి మల్లిక ఆధ్వర్యంలో ఓం నమో వెవకటేశాయ ద్వారక తిరుమల దేవస్థానంలో సావిత్రిబాయి పూలే అభ్యుదయ మహిళ కోలాట బృందం 222 మంది మహిళలతో దశావతారాల జానపద నృత్య కోలాటం ప్రదర్శించి ఈ విజయాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో బండి మల్లిక,పాంర్వతి, రమాదేవి, వెంకట సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

## అవినీతికి పాల్పడిన డ్వామా పీడీపై విచారణ నిర్వహించాలి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11 : గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన డ్వామా పీడీపై న్యాయ విచారణ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి రాజీనామా ఆమోదించడం శోచనీయమన్నారు. కోట్ల లో అవినీతి చేసిన పీడీపై న్యాయ విచారణ జరపాలన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కనుసన్నల్లో పనిచేసి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఆయన కొనసాగారన్నారు. అడ్డదారుల్లో పదోన్నతులు, ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. డ్వామా పీడీ అవినీతిపై సీఐడీ విచారణ చేయాలని కోరారు. యదుభూషణ్‌రెడ్డి స్వచ్ఛందంగా రాజీనామా చేసి బయట దేశాలకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజీనామా ఆమోదించడం బాధాకరమన్నారు. వందల కోట్లు అవినీతి చేసిన డ్వామా పీడీ నుంచి తక్షణమే అవినీతి సొమ్మును రికవరీ చేయాలని కోరారు.

## మైనార్టీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేయాలి

● మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా


విలేకరులతో మాట్లాడుతున్న ఆరిఫుల్లా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11 : వైసీపీ ప్రభుత్వంలో గోల్‌మాల్ అయిన మైనార్టీ నిధులపై విచారణ జరపాలని టీడీపీ మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 15931 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలోని మైనార్టీలకు రూ.11324 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు వైసీపీ ప్రభుత్వం చూపిందన్నారు. అయితే జగన్ ప్రభుత్వం ఎక్కడే కానీ రాష్ట్రంలోని మైనార్టీల కోసం నిధులు ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్ర మైనార్టీలకు మెడికల్‌కు క్యాంపుల కోసం వంద కోట్లు, యువత స్కిల్‌డెవల్‌మెంటు కోసం రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు గత ప్రభుత్వం చూపిస్తుందన్నారు. కేంద్రం కేటాయించిన నిధులపై సీఎం చంద్రబాబునాయుడు సీఐడీ విచారణ చేసి నిధులు స్వాధీనం చేసుకుని దోషులను అరెస్టు చేయాలన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులను జగన్‌మోహన్‌రెడ్డి దారాదత్తం చేశారని, వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీపై వీఆర్వోలకు ఊరట

కడప(కలెక్టరేట్), జూలై 11: సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీపై వీఆర్వోలకు ఊరట లభించింది. గత ప్రభుత్వ పాలనలో ఆధార్ కార్డు ఆధారంగా తీసుకొని సుమోటోగా క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు, వలంటీర్ల నిర్వాకంపై వీఆర్వోల సంఘం రాష్ట్ర నాయకులు అమరావతిలో రెవెన్యూ మంత్రి, రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనరు సాయిప్రసాద్‌ను గురువారం కలిసి విన్నవించుకున్నారు. రాష్ట్ర కమిషనరు స్పందించి సుమోటోగా క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో మీకు దొరికిన డేటా వరకు చేయాలని, కులం విషయంలో జాగ్రత్తగా అప్డేట్ చేయాలని, డేట్ ఆఫ్ బర్త్ విషయంలో ఎలాంటి ఎంట్రీలు చేయవద్దని, ఆప్షన్ కూడా తొలగిస్తున్నట్లు వీఆర్వోలకు ఊరట కల్పించారు. ఈ మేరకు నేడో రేపో కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ కానుండడంతో వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామగంగాధర్ రెడ్డి, దేవానంద్‌కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్త చేశారు.

## తల్లికి వందనం అర్హత, హాజరు శాతం కుదించాలి: ఏపీటీఎఫ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11:తల్లికి వందనం స్టూడెంట్ కిట్స్‌పై విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వుల జీఓ నెం.26ను కొద్ది మార్పులతో సవరించాలని ఏపీటీఎఫ్ అమారవతి రాష్ట్ర జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, ఈశ్వరచంద్ర అలీఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల హాజరు శాతం 60 నుంచి 75 వరకు ఉన్న వారికి కూడా అర్హత కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం వర్తింపజేసి ప్రభు త్వ బడులను బలోపేతం చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం ఐదు జతలకు పెంచాలని కోరారు. పాఠశాలల్లో సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే యూనిఫాం నిర్వహణ ఉండేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కూడా నోట్ బుక్కులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంధించిన తల్లికి వందనం చెల్లింపులపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

## నేడు 'గుడ్‌మార్నింగ్ కమలాపురం'

కమలాపురం రూరల్, జూలై 11 : నేడు గుడ్‌మార్నింగ్ కమలాపురం కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హాజరవుతారని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం 6.30గంటలకు ఉంటుందన్నారు. కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ప్రభుత్వ అధికారులతో కలిసి కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని గుడ్‌మార్నింగ్ కమలాపురం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని బీడీకాలనీ, కుమ్మరివీధుల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వీలైన వాటికి అప్పటికప్పటికే పరిష్కారం చూపనున్నారన్నారు. కమలాపురం నగర పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసిందిగా ఆయన తెలిపారు.

## నేడు కడపకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ రాక

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల


మాట్లాడుతున్న వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 11 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి నుంచి భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన కడప జిల్లావాసి సీఎం రమేశ్ శుక్రవారం కడపకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. అనకాపల్లి ఎంపీగా జయకేతనం ఎగురవేసి తొలిసారి కడపకు వస్తున్న సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. కావున పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సీఎం రమేశ్ జిల్లా పర్యటనను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 14న వర్క్‌ఫ్రమ్ హోంపై అవగాహన

పులివెందుల టౌన్,జూలై 11: ఈనెల 14వతేదీన స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఉదయం 10గంటలకు వర్క్ ఫ్రమ్ హోం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు వెల్‌నెస్ సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ వాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా తమ శ్రమనే పెట్టుబడిగా పెట్టిప్రజల ఆరోగ్యం సంరక్షణ కోసం హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి గల అనారోగ్య సమస్యలను పోగొట్టి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతూ మంచి ఆదాయాన్ని ఆర్జించే సువర్ణఅవకాశం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలన్నారు.

## సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్‌కు సీఎస్‌వైఎఫ్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11 : జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టరు శివశంకర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ హాస్టళ్లకు సంబంధించి 11 నెలలుగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెండింగులో ఉన్నాయన్నారు. బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో 8 నెలల బిల్లులు పెండింగులో ఉన్నాయని, అలాగే మైనార్టీ, ఎస్టీకి సంబంధించి కూడా చాలా నెలల నుంచి బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు. వాటి వల్ల హాస్టలు వార్డెన్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని, మెస్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

## డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గాలి హరిప్రసాద్

వేంపల్లె, జూలై 11: వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీరోగులను దృష్టిలో పెట్టుకొని డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. విజ యవాడ లో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ని కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అసమర్థత కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఆసుపత్ర భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. ఆసుపత్రిలోని అనేక సమస్యలను మంత్రికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ అన్ని విభాగాలకు వైద్యులను నియమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పినట్లు హరిప్రసాద్ తెలిపారు.

## ఉచిత ఇసుక విధానం ద్వారా పేదలకు లబ్ధి

● ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి


ఇసుక డంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్య

వీరపునాయుని పల్లె, జూలై 11: ఉచిత ఇసుక విధానం ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువా రం మండలంలోని ఎర్రబల్లి సమీపంలో సంగమేశ్వర ఆలయం చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇసుక డంప్‌ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక పేరుతో లక్షల కోట్ల రూపాయలు వైసీపీ ప్రభుత్వం దండుకుందన్నారు. ప్రస్తుత్రప భుత్వం ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఇసుక భారం తగ్గి నిర్మాణాలు ఎక్కువ అవుతాయన్నారు. దీనితో సొంతికల నెరవేరడంతో పాటు కార్మికులకు పని దొరుకుతుందన్నారు. టీడీపీ నాయకులుచంద్రశేఖర్‌రెడ్డి,ప్రసాద్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, పెద్ద ఓబులేసు, ఓబులేస్‌యాదవ్, సీతారామయ్య, గంగిరెడ్డి, సర్పంచు శివమారుతిరెడ్డి, వెంకటరమణారెడ్డి, పోలీసు రాజా పాల్గొన్నారు.

**సంగమేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే**

మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో వెలసిన సంగమేశ్వరున్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి సందర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు మురళీమోహన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డిల అధ్యక్షతన ఆలయపురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అనిమెల బాబు, రాంబాబు, మల్లి, ఎస్ఆర్‌పేట కృష్ణమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, యరమలపల్లె సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు ప్రగతికి మెట్లు: ఫారెస్టు రేంజర్


మొక్కలు నాటుతున్న రేంజర్ బాలసుబ్రమణ్యం

చక్రాయపేట, జూలై 11: చెట్లు నాటి వాటిని పెంచడం వల్ల అవి ప్రగతికి మెట్లు అవుతాయని వేంపల్లె ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం నాగులగుట్టపల్లె జడ్పీ హైస్కూల్లో అమ్మపేరుతో ఒక చెట్టు అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అ నంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, చెట్లను తొలగించకుండా చూడాలని సూచించాలన్నారు. వాటివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, చెట్లు ఉం డడంతో వాతావరణం కాలుష్యం తగ్గడం, వర్షం సకాలంలో కురవడం లాంటివి జరుగుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు మనోహర్, సుబ్బరాయుడు, మధుతో పాటు శివమనోహర్‌రెడ్డి, కొనసాని శంకర్‌రెడ్డి, సుమలత, ప్రసాద్‌రెడ్డి, మెడికల్ స్టోర్ ఆంజనేయులు, తుపాకుల చంద్ర, రామచంద్రారెడ్డి, రవీంద్రరెడ్డి, యోగాంజులరెడ్డి, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామప్పనాయుడు, రమణారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన యూసీఐఎల్ అధికారులు


మొక్కలు నాటి నీరు పోస్తున్న డాక్టర్ ఎస్.కె.సత్పతి

వేముల, జూలై 11: మండలంలోని తుమ్మలపల్లె వద్దనున్నయూసీఐఎల్ పరిసరాల్లో గురువారం అధికారులు మొక్కలు నాటారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ స్థాపింపబడి 70ఏళ్లు జరుపుకొంటున్న సందర్భంగా యూసీఐఎల్‌ను చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 11 : కృష్ణానీటిని రాయలసీమకు విడుదల చేయడంపై నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించి స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ సీజన్ ప్రారంభమై రైతులు సాగుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో కృష్ణ నీటిలో నికర జలాలు కలిగిన కేసీ కెనాల్ ఆయకట్టుకు, తెలుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు నీటిని విడుదల చేసేందుకు శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులు అమలు చేయాలని డి మాండ్ చేశారు. అరకొరగా ఉన్న నీటిని కూడా గత పాలక ప్రభుత్వాలు డైరెక్ట్‌గా ఆయకట్టుకు నీరు అందించే వెసులుబాటు లేనప్పటికీ ఇసుక మేటల కోసం నీటిని నదిలో వదిలేశారన్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల తుంగభద్ర, క్రిష్ణానదుల ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో శ్రీశైలంలోకి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదలకుండా కనీస నీటి మట్టం 854 అడుగులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నాగసుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా, మునెయ్య, లింగన్న పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం పుణ్యకార్యం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న సుబ్బారావు

కడప (కల్చరల్), జూలై 11 : అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం పుణ్యకార్యమని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కడప డిపో నాయకులు కోడూరు సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం హిమవర్షిణీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక చౌడమ్మ వృద్ధాశ్రమంలో కోడూరు సుబ్బారావు సతీమణి స్వర్గీయ క్రిష్ణవేణి వర్ధంతిని పురస్కరించుకుని అనాథ వృద్ధులకు అన్నదానం చేసి మాట్లాడారు. సమాజంలో ఎంతో మంది అనాథలు తిండి లేక ఆకలి దప్పులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి ఆకలి బాధ తీర్చేందుకు ధనవంతులు వారిసంపాదనలో కొంత భాగం అనాథ శరణాలయాలకు అందించేందుకు మానవతా దృకృథంతో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఫౌండేషన్ సేవకులు గుండ్లకొండ రవి, రెడ్డిలక్ష్మణ్, వెంకట సురేశ్‌బాబు, దామోదర్, టైలర్ రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం


ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి అరీఫుల్లా

పులివెందుల రూరల్, జూలై 11: చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని తొండూరు మండల వైద్యాధికారి అరీఫుల్లా తెలిపారు. గురువారం ప్రపంచజనాభా దినోత్సవం పురస్కరించుకొని తొండూరు జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కుటుంబ సంక్షేమం - దేశ సౌభాగ్యం, బాల్య వివాహాలు వద్దు -సరైన వయసులో వివాహం ముద్దులాంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

● కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి


వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి

కడప (క్రైం), జూలై 11 : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి సూచించారు. కడప వై జంక్షన్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ఆయన హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరూ బైకు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, తద్వారా రోడ్డు ప్ర మాద సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో హెల్మెట్ ధరించకుంటే చట్టప్రకారం జరిమానా విధిస్తామన్నారు. అలాగే నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందికి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిందని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కలెక్టర్‌ను కలిసిన వీఆర్వోల సంఘం నేతలు

కడప(కలెక్టరేట్), జూలై 11: నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను గురువారం జిల్లా గ్రామ రెవెన్యూ సంంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలకుండీ అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు రామగంగాధర్ రెడ్డి, యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవానంద్‌కుమార్, ఉపాధ్యక్షులు నాని,రాష్ట్ర కార్యదర్శి విజయ చైతన్య, నాగరాజు, అశోక్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జూలై 11: పట్టణంలోని అంబకపల్లె రోడ్డు, కడప రోడ్డు, బాకరాపురం, మెయిన్ రోడ్డు ప్రాంతాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 11కేవీ కడప రోడ్ ఫీడర్ కింద విద్యుత్ తీగల పనులు చేపడుతున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.




# పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించండి

అర్హులందరికీ పింఛను, భూములు పంపిణీ చేస్తాం ● బ్రహ్మంసాగర్ పనులు పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం

● కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు పంపాం : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, జూలై 11: పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి అధికారులు, సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఎంపీపీ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన బ్రహ్మంగారిమఠం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా పొందిన పింఛన్లపై వెంటనే విచారణ చేపట్టి అర్హులకు ఇవ్వాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్పను ఆదేశించారు. అర్హులైన నిరుపేదలకు తప్పకుండా పింఛన్లు, ఇంటిస్థలాలు, భూములను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద ఉన్న పిల్లకాల్వలకు త్వరలోనే మరమ్మత్తులు చేపట్టి ప్రతి రైతుకూ నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటికలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో శ్మశానాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో ఆక్రమిత భూములను తీసుకుని అర్హత కలిగిన నిరుపేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ భూములను సర్వే చేయాలని తహసీల్దారు శ్రీనివాసులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. మండలానికి కొత్తగా మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరవుతాయని ఆయన తెలిపారు. బద్వేలులోని సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీకి బ్రహ్మంసాగర్ నుంచి నీరు ఎలా వెళుతుందని సంబంధిత అధికారులను అడిగారు. వెంటనే బ్రహ్మంసాగర్ నుంచి సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీకి నీటిని ఆపాలని అధికారులకు సూచించారు. విజయవాడ నుంచి బ్రహ్మంగారి మఠానికి నడుపుతున్న బస్సుసర్వీసును నిలిపివేశారని ప్రజాప్రతినిధులు కోరారు. దీంతో వెంటనే కొనసాగించాలని ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కొనుగోలు చేశామని సమావేశంలో ఏఈ రవికుమార్ చెప్పగా గొడ్లవీడు సర్పంచ్ చెన్నక్రిష్ణారెడ్డి సొంత నిధులతో విద్యుత్ పనులు చేపట్టారని ఇంత వరకూ తనకు రూ.3లక్షలు డబ్బు రాలేదని సమావేశంలో తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి కడపకు నీటిని తీసుకువెళుతున్నారని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జగదీశ్ చెప్పగా ఎమ్మెల్యే స్పందించి వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో మంజూరైన ట్రాక్టర్లు ఎక్కడి వెళ్లాయని, ట్రాక్టర్లను వారం రోజుల్లో సచివాలయాల వద్ద ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఎమ్మెల్యేను సన్మానించారు. ఏఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఓ హరిక్రిష్ణ, పంచాయతీరాజ్ ఏఈ ప్రతాప్ వైద్య శాఖ డాక్టర్ సంపత్‌కుమార్, వెలుగు ఏపీఎం గొల్లపల్లె ప్రకాశ్‌రావు, డీటీ జాన్సన్, ఎంఈఓలు జి.పుల్లయ్య, వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు సంపత్, చెన్నకేశవరావు, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నేతలు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్‌ఆర్ శ్రీనివాసులరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పుట్టా ప్రభాకర్ యాదవ్, ముడుమాల పోలిరెడ్డి, సాంబశివారెడ్డి, బీమానాయుడు, ముద్దుక్రిష్ణమనాయుడు, మేకల సుధాకర్, చిలమల నారాయణ, వెంకటేశ్‌నాయుడు, నాగయ్య, పూజా శివయ్యయాదవ్, సుబ్రమణ్యం, ఆవులదస్తగిరి, బోలా శ్రీను, మిల్లు శ్రీను, సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తనిఖీ


ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తనిఖీ చేస్తున్న కమిషనర్ క్రిష్ణ

బద్వేలుటౌన్, జూలై 11: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను గురువారం మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ ఆస్మికంగా తనిఖీ చేశారు. ఫాస్ట్‌ఫుడ్, హోటల్స్‌లో నిషేధిత ఫుడ్‌కలర్, టేస్టింగ్‌సాల్ట్, కల్తీ నూనెలను వాడుతూ ప్రజల ఆరోగ్యాలను దెబ్బతినేలా చేస్తున్నారని సమాచారం రావడంతో దాడులను నిర్వహించారన్నారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా ఫుడ్ కలర్స్, కల్తీనూనెలు వాడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్స్, స్పూన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## వంటగదికి నిధులు మంజూరు

కాశినాయన జూలై 11: నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణం కోసం కలెక్టర్ లోతేటి శివశంకర్ రూ.11 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఎంఈఓ నిర్మల తెలిపారు. బుధవారం నర్సాపురం జడ్పీహైస్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో వంట ఏజెన్సీవారు వంటగదిలేక ఇబ్బందిపడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ మరుసటి రోజే వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈవిషయం సంబంధిత డీఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫోన్‌చేసి తెలియపరిచినట్లు సమాచారం.

## నేడు మండల సమావేశం

చాపాడు, జూలై 11: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంతులయ్య తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## రంగసముద్రంలో పరిసరాల పరిశుభ్రతా చర్యలు

పోరుమామిళ్ల, జూలై 11: రంగసముద్రం పంచాయతీలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, పంచాయతీ పరిధిలోని మురికి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. గిరినగర్, మహబూబ్‌నగర్, రాఘవేంద్ర నగర్‌లలో అపరిశుభ్రత కలిగిన ప్రాంతాల్లో చెత్త చెదారం తొలగించి స్ప్రే చేశారు. ఎంపీడీఓ వరప్రసాద్ ఈ పనులు పర్యవేక్షించారు.

## కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

ఎర్రగుంట్ల, జూలై 11: మండలంలో కౌలురైతులు పంటసాగు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ సౌజన్య లక్ష్మి తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసలుబాటు కల్పించందని, ఆయా సచివాలయ పరిధి వీఆర్‌ఓకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.















# గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించాలి

కలసపాడు, జూలై 11: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులకు సకాలంలో చికిత్స అందించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేశ్, పశువైద్య సహాయ చికిత్సకులు డాక్టర్ శివరామిరెడ్డి సూచించారు. రెడ్డిపల్లెలో గురువారం నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో వారు మాట్లాడారు. శిబిరానికి పోరుమామిళ్ల ప్రాంతీయ పశువైద్యశాల




కలసపాడులో పశువులకు గర్భకోశ వ్యాధులపై చికిత్స అందిస్తున్న వైద్యులు - ముద్దనూరులో ఇంజక్షన్ వేస్తున్న ఇన్‌చార్జి సహాయ సంచాలకులు

సహాయ సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్, టేకూరుపేట పశువైద్యులు డాక్టర్ శివశ్రీనివాసులరెడ్డి, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 78 పశువుల్లో 16 పశువులకు గర్భకోశ చికిత్స చేయించారు. ఇంకా ఎదకు రాని పశువులు 40, చూలు పరీక్షల్లో పాల్గొన్న పశువులు 22, మిగతా 18 పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో రైతులు పెద్ద మొత్తంలో పాల్గొని పశువులకు చికిత్స అందించు కున్నారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

## పచ్చిగడ్డి పశువులకు ఆరోగ్యకరం

ముద్దనూరు జూలై11: పచ్చిగడ్డి పశువులకు ఆరోగ్యకరమని ముద్దనూరు పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకు వాసా శ్రీనివాస తెలిపారు. పశువారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తపల్లెలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఏక వార్షికాలైన జొన్న, మొక్కజొన్న, సజ్జ, పిల్లిపెసర, అలసందలు వాడకంపై రైతులకు వివరించారు. బహు వార్షికాలైన సూపర్ నేపియర్, పారా గ్రాస్, గినీ గ్రాస్, లూసర్న్ వంటి పచ్చిగడ్డి వాడకంతో కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. పచ్చిగడ్డి పశువులకు పెట్టడం వల్ల పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శశిరేఖ, నాగుమయ్య, యాసీన్, లావణ్య, వీరేంద్ర పాల్గొన్నారు.

**తమ్మాపురంలో...**

గొర్రెలు, మేకలకు నీలి నాలుక(బ్లూ టంగు)టీకాలు తప్పక వేయించాలని పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకు శ్రీనివాస పేర్కొన్నారు. తమ్మాపురంలో ఉచితంగా గొర్రెలు, మేకలకు నీలి నాలుక టీకా వేయించారు. దాదాపు 9500 గొర్రెలు, మేకలకు టీకా వేసినట్లు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పుట్టా



కలెక్టర్ శివశంకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ జూలై 11: నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కలెక్టర్ శివశంకర్‌ను గురువారం కడపలో కలిశారు. గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణల గురించి, బోగస్ ఫించన్లు, ఉపాధిలో అక్రమాలు, పనులు చేయకుండా బిల్లులు తీసుకోవడం వంటి వాటిపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజోలి ఆనకట్టపై కూడా చర్చించినట్లు పుట్టా తెలిపారు. కలెక్టర్ స్పందించి త్వరలో జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులతో కలిసి ఒక మీటింగ్ పెట్టి అవినీతిని బట్టబయలు చేస్తామని, కఠినంగా శిక్షిస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాలు



కేక్ కట్ చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

బద్వేలు రూరల్, జూలై 11: కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసిన ఏకైక యూనియన్ ఎంప్లాయీస్ యూనియన్ అని జిల్లా అధ్యక్షుడు బోస్‌బాబు, డిపో సెక్రటరీ నరసింహులు తెలిపారు. స్థానిక డిపోలోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేసి ఉద్యోగులందరికీ పంచిపెట్టారు. పీఆర్సీ 43 శాతం, 25 శాతం కారుణ్య నియామకాలు, క్యాజువల్స్ రెగ్యులర్ చేయడం వంటి కార్యక్రమాల్లో యూనియిన్ నిరంతర పోరాటం చేసిందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పట్ల యూనియన్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గంగయ్య, మాధవరెడ్డి, పెంచలయ్య, వైజే రెడ్డి, నాగరాజు, జీవా, గురవయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

## చెన్నకేశంపల్లెలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్, జూలై 11: చెన్నకేశంపల్లెలో గురువారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పలు సమస్యలపై వార్డులో పర్యటించారు. ప్రజలు చెన్నకేశంపల్లెలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్డుపై రావడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని, సీజన్ వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆమెకు వివరించారు. ప్రత్యేక నిధుల ద్వారా సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జీవీ సుబ్బారెడ్డి, మిత్తికాయల రమణ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెస్తాం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 11: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తామని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. గురువారం ఎంపీజే కార్యాలయంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయం, శాంతిస్థాపన కోసం ఎంపీజే కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం పట్టణాధ్యక్షుడిగా షేక్ హుస్సేన్‌బాష, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫిక్, కోశాధికారి ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌రఫి, సహాయ కార్యదర్శి అబ్దుల్ గని, మీడియా కార్యదర్శి అస్లాం, సయ్యద్, ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్‌ఉమ్రి, జమా అతే ఇస్లామి హింద్ పట్టణాధ్యక్షుడు షఫీవుల్లా పాల్గొన్నారు.

## మొదలైన మొహర్రం



టంగుటూరులో కొలువుదీరిన బాబా ఫక్రుద్దీన్‌పీరు

రాజుపాలెం, జూలై 11: మొహర్రం వేడుకల సందర్భంగా గ్రామాల్లో బుధవారం పీర్లు కొలువుదీరాయి. టంగుటూరు గ్రామంలో బాబా ఫక్రుద్దీన్ పీర్లను ఊరేగిస్తారు. ఆదివారం చిన్న సర్కస్ మంగళవారం పెద్ద సర్కస్ బుధవారం పీర్లను ఊరేగింపు చేసి కుందనపల్లె శుభ్రపరచడం దీంతో పండగ అయిపోతుందని తెలిపారు.































# అధిక జనాభా దేశాభివృద్ధికి అవరోధం




బద్వేలులో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న డాక్టర్ పి.జ్యోత్స్న స్వర్ణలత, వైద్యసిబ్బంది - ప్రొద్దుటూరులో వైద్యులు, సిబ్బంది, ప్రజల ర్యాలీ

బద్వేలు రూరల్, జూలై 11: అధిక జనాభాతో దేశాభివృద్ధి కుంటుపడుతుందని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, స్వర్ణలత అన్నారు. గురువారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ, సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధిక జనాభాతో తగిన వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి బిడ్డకు బిడ్డకూ ఎడం కనీసం మూడేళ్లు గ్యాప్ ఉండేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయ్‌కుమార్, శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజరు వెంకటమ్మ, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

### జనాభా ప్రగతికి అవరోధం

ప్రొద్దుటూరు క్రైం, జూలై 11: పెరుగుతున్న జనాభా ప్రగతికి అవరోధమని డాక్టర్ ఎన్.హిమబిందు అన్నారు. గురువారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో అవగాహణ నిర్వహించారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా ప్రగతికి అవరోధమన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకోవడం వల్ల తల్లీబిడ్డను క్షేమంగా తీసుకురాగలమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గురప్ప, సిర్డ్స్ సొసైటీ ప్రెసిండెంట్ ఎంవి సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, టీబీ రోడ్డు పట్టణ అరోగ్యకేంద్రం సిబ్బంది, విద్యార్థులు ఆశాలు హజరయ్యారు.

### వైద్య సిబ్బంది ర్యాలీ

జనాభా నియంత్రణ లేకుంటే ఆర్థిక సంక్షోభాలు ఎదుర్కొంటాయని ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కామనూరు, గోపవరం, సోములవారి పల్లె సచివాలయాల పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ నేడు జనాభాను నియంత్రించడం ద్వారా రేపటి భవిష్యత్తు బాగుటుందన్నారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి జనాభా నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, యూనిట్ అధికారి శ్రీను, సీహెచ్‌ఓ క్రిష్ణమ్మ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### జనాభా పెరిగితే కష్టాలే

ఖాజీపేట, జూలై 11: జనాభా పెరిగితే నాణ్యమైన విద్య, సరైన గృహ వసతి, పౌష్టికాహారం అందించడం కష్టమవుతుందని వైద్యాధికారి ముబీన్ అన్నారు. గురువారం శ్రీచైతన్య, కొత్తపేట హైస్కూలులో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. విస్తరణాధికారి నాగభూషణం, ఆశా నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ శాంతమ్మ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

కలసపాడు, జూలై 11: మండలంలో పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. గురువారం బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజు, కలసపాడు ఎంఏఓ జాకీర్‌షరీఫ్ ఆయా దుకాణాలను తనిఖీ చేసి సంబంధిత రికార్డులు, బిల్ బుక్స్, నిల్వలు అన్నీ తనిఖీ చేయడం జరిగిందని వారు తెలిపారు.



కలసపాడులో ఎరువుల, మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు






## పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్

### ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు



కొనేటి కాల్వ వీధిలో ప్లాస్టిక్ కవర్లు పట్టుకున్న కమిషనర్ తదితరులు

ప్రొద్దుటూరు, జూలై 11: పట్టణంలో పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్ పెట్టారు. గురువారం కమిషనర్ రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు శానిటరీ డివిజన్ల పరిధిలో కాల్వలు శుభ్రం చేయడం వ్యర్థాలను తరలించే పనులను గ్రూప్ వర్కుగా చేపట్టారు. రాష్ట్రంలో డయేరియా డెంగ్యూ విజృంభిస్తూ ప్రజలు రోగాల బారిన పడి మృతి చెందుతుండడంతో మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదినక చేపట్టారు. ప్రజలు తాము నివసించే పరిసరాల్లో అపరిశుభ్రంగా వుండరాదని పరిసరాలు శుభ్రంగా వుంచుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పారిశుధ్యంలో ప్రధానంగా కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతోనే మురుగు పారుదల జరగకపోవడంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, డెంగ్యూ విజృంభిస్తోందన్నారు. పట్టణ పరిశుభ్రతపై ప్రతి పౌరుడు దృష్టి పెట్టాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూరుబాషా, సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంట్‌ప్రసాద్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ హంస నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షున్ని సన్మానిస్తున్న ఉద్యోగులు

బద్వేలు రూరల్, జూలై 11: ఆంధ్ర ప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) బద్వేలు నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా నరసింహ ప్రసాద్, సెక్రటరీలుగా జాన్ విలియంతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజారత్నం, చంద్రమౌళి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటసుబ్బయ్య, ట్రెజరర్‌గా రామతీర్థం, ఉపాధ్యక్షుడిగా వాణిశ్రీ, సుబ్బనరసమ్మ, రమణయ్య, వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బుజ్జమ్మ తదితరులతో కార్యవర్గం ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏపీ జీఈఏ తాలుకా అధ్యక్షుడు హుసేనయ్య, సెక్రటరీ పుష్పరాజ్, బ్రహ్మాజీ, రామచంద్రయ్య, మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలి

బద్వేలుటౌన్, జులై 11: సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి బ్రహ్మాజీ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు హాస్టళ్లలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ బ్రహ్మాజీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఏఎన్‌ఎం జయసుధ, ఆశావర్కర్, వార్డన్లు పాల్గొన్నారు.

## డయేరియా పట్ల జాగ్రత్తగా ఉండాలి

చాపాడు, జూలై 11: మండల ప్రజలు అతిసార పట్ల జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు ఓబులేసు, శ్రీవాణి అన్నారు. నక్కలదిన్నె, నరహరిపురం, వెదురూరు గ్రామాల్లో అతిసారపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ఈ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ ఎవరికైనా విరేచనాలైతే విటమిన్-ఎ సిరప్ తీసుకోవాలని చెప్పారు. చిన్నారులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సీహెచ్‌ఓ మహదేవ్‌యాదవ్, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ జూలై 11: ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మూలబాట వీధిలో గురువారం వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. అంనతరం మహిళలకు ఆయన స్వయంగా తాగునీటి బిందెను అందించారు. నామమాత్రపు చిల్లర వసూలు చేస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా తాగునీటి పథకం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

ఖాజీపేట, జూలై 11: ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ శ్రీదేవి అన్నారు. దుంపలగట్టు అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జహిరాబీ, టీచర్ గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మొహర్రం వేడుకలు

పోరుమామిళ్ల, జూలై 11: పోరుమామిళ్లలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు పురస్కరించుకుని ఉద్దికట్టవీధి పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. హుసేన్‌పీర్ దర్గా సమీప పీర్లచావిడిలో పీర్లు కొలువుదీరాయి.











